క్లుప్తంగా

ఆంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు



వేదపండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని ఎల్‌జీబీనగర్ సమీపాన నూతనంగా నిర్మించి బయలు ఆంజనేయస్వామి దేవాలయంలో సంప్రోక్షణ కార్యక్రమంలో భాగంగా బుధవారం తురకలాపట్నం, ఎల్‌జీబీనగర్ గ్రామాల్లో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని ముత్యాల పల్లకీలో ఊరేగించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొని అంజన్నకు ప్రత్యేక పూజలు చేశారు.

నూతన గృహ ప్రవేశంలో..

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి నూతన గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే శంకరనారాయణ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు చేపల చెరువు వేలం

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ చెరువులో చేపల పెంపకానికి గురువారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ శ్రీరామప్ప, సెక్రెటరీ నారాయణ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైకుంఠ రథం కొనుగోలుకు విరాళం

గోరంట్ల: గోరంట్ల మేజర్ పంచాయతీ, దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న వైకుంఠ రథం కొనుగోలుకు మండల పరిధిలోని బూడిదగడ్డపల్లికి చెందిన ప్రవాస భారతీయుడు శేషాద్రిరెడ్డి 1,50,116 విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని చెక్కు ద్వారా బుధవారం శేషాద్రిరెడ్డి తల్లి ఓబుళమ్మ గ్రామ పంచాయితీ కార్యదర్శి సతీష్‌కుమార్‌కు అందజేశారు.

కేపీసీసీ కార్యదర్శిగా షా బాబు

పావగడ: కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనారిటీ విభాగం కార్యదర్శిగా షాబాబు ఎంపిక య్యారు. ఈ మేరకు కేపీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ కే అబ్దుల్ జబ్బార్ అధికారిక పత్రాన్ని షా బాబుకు బుధవారం అందచేశారు. ఆయన ఎంపిక పట్ల స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్ బాబు, మాజీ జెడ్పీ సభ్యుడు హెచ్‌వి వెంకటేశ్ తదితరులు హర్షం తెలిపారు.

మరమ్మతుకు రూ.75 లక్షల మంజూరు

మడకశిర: నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతుకు రూ.75 లక్షలు మంజూరైనట్లు స్థానిక ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 20 కల్వర్టులు దెబ్బతిన్నట్లు తెలిపారు. త్వరలోనే కల్వర్టుల మరమ్మతు పనులను పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు కూడా పూర్తి చేసినట్లు తెలిపారు.

సమ్మెతో రోగుల ఇబ్బందులు



ప్రభుత్వాస్పత్రి గేటును మూసివేస్తున్న సిబ్బంది

పావగడ: ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో వైద్యసిబ్బందికి కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వాస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోగులను గేటు వద్దే వెనక్కి పంపించడంతో దూరప్రాంతం నుంచి వచ్చిన వారు నిరాశతో వెనుతిరిగారు. అయితే బుధవారం సాయంత్రం సమ్మెను విరమిస్తున్నట్లు ఉద్యోగ సంఘాలు ప్రకటించడంతో అన్ని వర్గాల వారు ఊపిరిపీల్చుకున్నారు.

రికార్డులు పక్కాగా ఉండాలి

అమరాపురం: పాఠశాలలో ఉపాధ్యాయులు రికార్డులు పక్కాగా నిర్వహించాలని మండల విద్యాధికారి సత్యనారాయణ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని కనకనపల్లిలో ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీటీసీ కెంచప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జింక అప్పగింత



యువకులు కాపాడిన జింక ఇదే

హిందూపురం: అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి జనవాసంలోకి వచ్చిన జింకను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. బుధవారం లక్ష్మీపురం పరిసరాల్లో కుక్కలు ఓ జింకను తరుముతుండగా శేషాద్రి, మల్లికార్జున, రాజేష్, గిరి, పవన్, ప్రవీణ్ కాపాడారు. లైఫ్ వరల్డ్ చారిటబుల్ ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్ సహకారంతో బుధవారం రాత్రి జింకను ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

అభివృద్ధి బాట



నాడు: గుంతలు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు: కెంకెర నుంచి గుణేహళ్ల వరకూ వేసిన తారు రోడ్డు

- అధ్వాన్నంగా ఉన్న రోడ్లతో కొన్నేళ్లుగా జనం ఇబ్బందులు
- నూతనంగా రోడ్లు వేయడంతో సర్వత్రా హర్షం

అమరాపురం: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం హేమావతి సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు రూపురేఖలు మారిపోయాయి. నూతనంగా తారు రోడ్డు వేయడంతో సర్వంగా సుందరంగా తయారైంది. దీంతో ముఖ్యంగా భక్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కెంకెర నుంచి హేమావతి, గుణేహళ్లి మీదుగా కె.శివరం క్రాస్ వరకూ రోడ్డు గతంలో గుంతలమయంగా మారి ద్విచక్ర, పెద్ద వాహనాలు వచ్చి పోడవానికి తీవ్ర ఇబ్బందులు పడేవారు. గతంలో ఆయా గ్రామ ప్రజలు అప్పటి ప్రభుత్వానికి తెలిపినా ఉపయోగం లేక పోయింది. అయితే ఎమ్మెల్యే తిప్పేస్వామి చొరవతో తారురోడ్డు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం రూ.1.7 కోట్ల నిధులు మంజూరు చేసింది. వెంటనే సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు పనులను శరవేగంగా పూర్తి చేశారు. కెంకెర గ్రామం నుంచి కె.శివరం క్రాస్ వరకూ 6 కిలో మీటర్ల మేర తారు రోడ్డు వేశారు. కెంకెర, హేమావతి, గుణేహళ్లి గ్రామాల ప్రజలే కాక గుడిబండకు వెళ్లే వారితో పాటు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే వారు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే శైవ క్షేత్రం హేమావతి సిద్ధేశ్వరస్వామిని దర్శించుకునే భక్తులకు కూడా ఇబ్బందులు తప్పాయి.

నరకయాతన తప్పింది



మా గ్రామం నుంచి నూతనంగా తారు రోడ్డు వేయడంతో చాలా సంతోషంగా ఉంది. గతంలో రోడ్డు గుంతలమయంగా ఉండేది. కాలి నడకన వెళ్లడానికి కూడా నర కయాతన పడేవాళ్లం. ప్రస్తుతం తారు రోడ్డు వేయడంతో ఇబ్బందులు తప్పాయి.

– పుట్టమ్మ, కెంకెర, అమరాపురం

శేషాపురం రోడ్డుకు మోక్షం



శేషాపురం గ్రామంలో సిమెంట్ రోడ్డు వేసిన దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని శేషాపురం గ్రామానికి సరైన రోడ్డు లేక ప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గత 30 ఏళ్లుగా మండలాన్ని పాలించిన టీడీపీ నేతలు ప్రజల కష్టాలను గుర్తించి రోడ్డు బాగు చేయలేకపోయారు. 2019 ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామానికి రోడ్డు వేయిస్తామని ఎమ్మెల్యే శంకరనారాయణ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని నిలుపుకున్నారు. రూ.80 లక్షల నిధులతో హిందూపురం–రొద్దం ప్రధాన రహదారి నుంచి గ్రామానికి రెండు కిలో మీటర్ల సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయించారు.

ఏళ్ల కల నెరవేరింది



మా గ్రామానికి సరైన రోడ్డు లేక బస్సులు, ఇతర వాహనాలు, 108 రావాలంటే ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే శంకరనారాయణ నిధులతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేసినందుకు సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే శంకరన్నకు రుణపడి ఉంటాం. ఏళ్ల కల నెరవేర్చినందుకు కృతజ్ఞతలు. – శివరాజ్, ఎస్సీ కాలనీ, శేషాపురం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



పోలింగ్ బూత్ ఇన్‌చార్జులతో సమావేశమైన ఎమ్మెల్యే తిప్పేస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

మడకశిర: త్వరలోనే జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. బుధవారం తన స్వగృహంలో మడకశిర మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టభద్రుల స్థానం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో ఓటర్లను కలిసి జోరుగా ప్రచారం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఓటర్లకు వివరించాలని సూచించారు. ప్రధానంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని పట్టభద్రులకు తెలపాలన్నారు.

హిందూపురం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రరెడ్డి, రామచంద్రారెడ్డి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి మున్సిపల్ వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ఓటర్లను కోరాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ ఫలాలు, సాధించిన ప్రగతిని వివరించాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఓటర్లను గుర్తించి వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలన్నారు.

2024 ఎన్నికల గెలుపునకు నాంది

ప్రస్తుతం జరుగుతున్న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలి.. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలుపునకు నాంది కావాలి' అని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. అన్నివర్గాలకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి యువత, ఉద్యోగులు ఓటుతో మద్దతు పలకాలని కోరాలన్నారు. తర్వాత మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఇంద్రజలు మాట్లాడుతూ వార్డుల వారీగా కౌన్సిలర్లు, నాయకులు ఓటర్లను గుర్తించి వారిని కలిసి ఓటుతో మద్దతు కోరాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పాడు బడ్డబావి మూసివేత



పాడుబడ్డబావిని పూడ్చివేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ఆటోనగర్‌లోని ఓ పాడుబడ్డ బావిలో కొందరు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు మెడికల్ వ్యర్థాలు వేసి నిప్పుపెడుతూ పర్యావరణాన్ని కలుష్యం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కమిషనర్ వెంకటేశ్వరరావు సిబ్బందితో పాడుబడ్డ బావిని మూసివేయించారు. మరోవైపు మెడికల్ వ్యర్థాలు పడవేసిన ఆస్పత్రుల నిర్వాహకులను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



నిర్మాణంలో ఉన్న రేషంషెడ్డు ఇదే

రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బీదానిపల్లిలో టీడీపీ సర్పంచ్ మంజునాథ్ తండ్రి రామాంజినేయులుపై ఈఓఆర్డీ కేశవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. సర్వేనంబర్ 27, 27–1వ లెటర్‌లో మూడు సెంట్ల స్థలాన్ని రామాంజినేయులు ఆక్రమించారని ఈఓఆర్డీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నోటీసులు జారీ చేసినా ఆయన స్పందించకపోవడంతోనే పోలీసులను ఆశ్రయించినట్లు చెప్పారు.

జోరుగా ఎన్నికల ప్రచారం



గౌడనకుంటలో ప్రచారం నిర్వహిస్తున్న నళిని

అమరాపురం: మండలంలోని గౌడనకుంట, మద్దనకుంట, తదితర గ్రామాల్లో బుధవారం రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ నళిని, డైరెక్టర్ వీరక్యాతరాయప్పల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరుపున ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నారాయణ, కెంచప్ప, నాగభూషణ, శివకుమార్, తదితరులు ఉన్నారు.

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మంచి మెజర్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్ అనంతపురం పంచాయితీలోని గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు రవీంద్రరెడ్డికి వేసి గెలిపించాలని కరపత్రాన్ని అందించారు. మండల జగనన్న సచివాలయం కన్వీనర్ నాగేంద్రయాదవ్, సర్పంచ్ అంజినమ్మ,మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు బాబిరెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీనరసమ్మ, పంచాయితీ ఇన్‌చార్జి వెంకటేష్‌రెడ్డి, హనుమంతరాయుడు, నాయకులు రవి, చలపతి, జనార్ధన్‌రెడ్డి, హనుమంతప్ప పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలో గెలుపు



విజేతలు శ్రీనివాస్, శరత్ బాబు

పావగడ: తాలూకాలోని వళ్ళూరు గ్రామ పంచాయతీ పరిధిలోని బళసముద్రం గ్రామానికి చెందిన ఇద్దరు సభ్యుల రాజీనామాతో ఖాళీ పడిన సభ్యత్వ స్థానాలకు గత నెల 25న ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ మద్దతుదారుడు శరత్ బాబు తన సమీప ప్రత్యర్థి జేడీఎస్ మద్దతుదారుడు నరసింహపై 202 ఓట్ల మెజారిటీతో విజయభేరి మోగించారు. మరో అభ్యర్థి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించండి

హిందూపురం టౌన్: స్థానిక ఈఎస్‌ఐ ఆస్పత్రిలో సిబ్బంది, మందుల కొరతతో పాటు నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఈఎస్‌ఐ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ జగదీశ్వర్ రెడ్డికి సీఐటీయూ నాయకులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెడ్పీ శ్రీనివాసులు, ప్రీకాట్ వర్కర్స్ యూనియన్ నందీష్, హనుమంతరాయప్ప, లక్ష్మీనారాయణ రెడ్డి, సదాశివరెడ్డి, జగదీష్, నరసింహప్ప, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ చేసిన డీవైఈఓ

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీవైఈఓ రంగస్వామి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో అనంత సంకల్పం, ఇతర విషయాలపై చర్చించి అవగాహన కల్పించారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్లను పరిశీలించి దానిపై అవగాహన కల్పించడంతో పాటు పురోగతిని ప్రశ్నించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించండి

గోరంట్ల: రజక కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మండల రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల రజక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాయాన్ని ముట్టడించారు. అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామంద్ర, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మడకశిర: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివకుమారి తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో చేరడానికి ఇప్పటికే టెన్త్ పాసైన విద్యార్థులు, ప్రస్తుతం టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఏప్రిల్ 30లోగా దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందని పేర్కొన్నారు. మడకశిరలో పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో పాలిసెట్–2023 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు.

రేపటి నుంచి లక్ష్మీనారసింహుడి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి రథానికి మరమ్మతు చేస్తున్న దృశ్యం

చిలమత్తూరు: మండల కేంద్రంలో వెలసిన కనుమ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. 3న అంకురార్పణ, 4న మోహినీ ఉత్సవం, 5న హనుమంత వాహనం, 6న శ్రీవారి కల్యాణం,7న బ్రహ్మరథోత్సవం, 8న ముత్యాల పల్లకీ ఉత్సవం, 9న ధ్వజావరోహణం, ఉయ్యాలోత్సవం, 10న పుష్పయాగోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రేపు మడకశిరకు శంకరనారాయణ రాక

మడకశిర: జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శంకరనారాయణ, మడకశిర ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి శుక్రవారం మడకశిరకు వస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిరలోని తన స్వగృహంలో ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నిర్వహించనున్న సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన



పూజలందుకున్న పట్టాభి రామచంద్రస్వామి

మడకశిర(అగళి): అగళి మండలం కోడిపల్లిలో బుధవారం పట్టాభి రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటకకు చెందిన ఎలెరాంపురం మఠం హనుమంతనాథస్వామి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఉదయం నుంచి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా పురోహితులు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రామాలయం నిర్మాణానికి గోరంట్ల మాజీ జెడ్పీటీసీ సభ్యులు కరావులపల్లి ఆర్.వెంకటరెడ్డి బుధవారం రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని గ్రామ పెద్దలు మునలిరెడ్డి, ఇందిలి నారాయణరెడ్డి, రాఘునాథ్ తదితరులకు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ మాజీ ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐ మధును సస్పెండ్ చేయాలి



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

హిందూపురం టౌన్: జర్నలిస్టులపై దాడులు చేసి వారిపైనే అక్రమ కేసులు బనాయించిన కదిరి పట్టణ సీఐ తమ్మిశెట్టి మధును వెంటనే సస్పెండ్ చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. బుధవారం హిందూపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు స్థానిక ప్రెస్‌క్లబ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

ఫుట్‌బాల్ జట్టుకు అభినందన

మడకశిర: హిందూపురంలోని ఎస్‌డీజీఎస్ కళాశాల మైదానంలో యూనైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో అండర్–13 విభాగంలో ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఫైనల్ పోటీల్లో పరిగి జట్టుపై మడకశిర జట్టు ఘన విజయం సాధించింది. ఈ సందర్భంగా మడకశిర ఫుట్‌బాల్ జట్టు సభ్యులను బుధవారం మడకశిరలో స్థానిక ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రవిశంకర్, మోహన్, నవీద్ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంట వ్యాధి టీకాలు అందించినట్లు పశువైద్యుడు బాలాజీ నాయక్ తెలిపారు. పశువులకు జ్వరం, నోటిలో పల పుండ్లు తదితర జబ్బులు సోకకుండా నివరించడానికి గాలికుంట వ్యాధి నిరోధక టీకాలు తప్పక వేయించాలని పాడి రైతులకు ఆయన సూచించారు. ఈ నెల 31 వరకు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఆనందమని 'పింఛన్'



రొళ్ల: హొట్టేబెట్టలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్



మడకశిరరూరల్: జీబీ పాళ్యంలో ఇంటి వద్ద వృద్ధునికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్



అమరాపురం: వేలుబండలో పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ కన్వీనర్



హిందూపురం: తెల్లవారక ముందే లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామునుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో కలసి పింఛన్ పంపిణీ చేశారు. ఉదయాన్నే తంఛన్‌గా పింఛన్ చేతికి అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల్లో పింఛన్ పంపిణీలో హిందూపురం మున్సిపాలిటీ మొదటిస్థానంలో నిలిచింది. మొత్తం 13,152 పింఛన్లలో మొదటిరోజు 12,022 మందికి పంపిణీ చేసి 91.41 శాతం పూర్తిచేశారు.